సాక్షి
అనంతపురం

సోమవారం ; 9 ; సెప్టెంబర్ ; 2024



వైభవంగా ఉత్సవం

రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలో బోడమల్లయ్య స్వామి ఉత్సవం ఆదివారం వైభవంగా జరిగింది.

8లో



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

33.4°/ 24.2°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.



అనంతపురం మండలం పాపంపేటలో కొలువుదీరిన వృశ్చిక వినాయకుడు



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో ఆకట్టుకుంటున్న వినాయక ప్రతిమ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉండ్రాలయ్యా.. దీవించయ్యా

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. వాడవాడలా కొలువుదీరిన గణపయ్య విగ్రహాలు శనివారం నుంచి ప్రత్యేక పూజలందుకుంటున్నాయి. బహురూపాల్లో దర్శనమిస్తున్న ఏకదంతుడిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని తరిస్తున్నారు. పలు చోట్ల ప్రసాదాల పంపిణీ, అన్నదానాలు నిర్వహించారు.– సాక్షి నెట్‌వర్క్



అనంతపురం రెవెన్యూ హోంలో కొలువుదీరిన గణనాథుడికి పూజలు చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

న్యూస్‌రీల్

జ్వరంతో విద్యార్థి మృతి



యశ్వంత్ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తి గ్రామానికి చెందిన యశ్వంత్ (15) అనే విద్యార్థి జ్వరంతో శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు.. తోపుదుర్తికి చెందిన ఈశ్వరయ్య, పద్మావతి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు యశ్వంత్ తోపుదుర్తి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల క్రితం తల్లి దండ్రులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే చికిత్స ఫలించిక యశ్వంత్ శనివారం ప్రాణాలు వదిలాడు.

వినాయక ఉత్సవాలకు పటిష్ట భద్రత

అనంతపురం:వినాయక ఉత్సవాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. గణేష్ మంటపాలు, ప్రతిమల ఏర్పాటు మొదలు నిమజ్జనం పూర్తయ్యే వరకు పాటించాల్సిన విధివిధానాలు పోలీసులకు తెలియజేశామన్నారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రశాంత పరిస్థితులు కొనసాగేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాత్రి సమయంలో ఎటువంటి ప్రమాదాలు, సంఘటనలు జరగకుండా గస్తీ పెంచామన్నారు. నిమజ్జనం రోజు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడంలో పోలీసులు నిమగ్నమయ్యారని తెలిపారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం 34,881 క్యూసెక్కుల నీరు నదిలో చేరింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరద పెద్ద ఎత్తున వస్తోంది. దీంతో 13 గేట్లను ఎత్తి 24,210 క్యూసెక్కులు నదికి, 10 వేల క్యూసెక్కులు కాలువలకు కలిపి మొత్తం 34,881 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 101.770 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,632 అడుగులకు నీరు చేరింది. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,850 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

నేత్రపర్వం... శ్రీవారి పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: వినాయక చవితి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, దీక్షా హోమం, విశేష అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

నిర్వహణలో డకౌట్..

- దులీప్ ట్రోఫీ నిర్వహణలో బయటపడిన లోపాలు
- రూ.4.5 కోట్లు అందినా వసతుల కల్పనలో విఫలం
- మంచి నీరు ఉచితంగా ఇవ్వాలన్న నిబంధన గాల్లోకి..
- తినుబండారాలు, కూల్‌డ్రింక్స్ విక్రయ కాంట్రాక్టు ఏకపక్షంగా కేటాయింపు
- ఇష్టారాజ్యంగా పాసులు పంచిన ఒక అధికారి
- పాసులు పొందిన వారు రాక సగం స్టేడియం ఖాళీ
- క్రికెట్ ప్రేమికులకు తీరని వేదన
- ఆటగాళ్లకు భద్రతలోనూ వైఫల్యం
- ఏసీఏ, డీసీఏ సమన్వయలోపంతో దుస్థితి దాపురించిన వైనం

దేశవాళీ క్రికెట్ టోర్నమెంటుల్లో దులీప్ ట్రోఫీ అత్యంత ప్రతిష్ఠాత్మకమైంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన టోర్నీకి అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామం వేదికగా మారింది. ఎక్కడా లోటుపాట్లు లేకుండా మ్యాచులను విజయవంతంగా ముగిస్తే.. జిల్లాకు పేరు ప్రఖ్యాతులు రావడంతో పాటు మరిన్ని మెగా టోర్నీలు ఇక్కడ జరిగే అవకాశముంటుంది. కానీ 'అనంత'లో మ్యాచుల నిర్వహణను చూస్తే అదంతా కలేననే భావన కలుగుతోంది. నిర్వాహకుల ఇష్టారాజ్యం, బెల్లంపప్పుల్లా తమ వారికి పాసుల పంపిణీ, వసతుల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం, బీసీసీఐ నిబంధనల ఉల్లంఘన, క్రీడాకారులకు తగిన భద్రత కల్పించడంలో వైఫల్యం వెరసి ఉన్న పరువూ పోయే దుస్థితి దాపురించింది.

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా ఈ నెల 5న ఇండియా సీ, ఇండియా డీ జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్ శనివారం ముగిసింది. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ క్రికెటర్లతో పాటు ఐపీఎల్‌లో మెరిసిన క్రీడాకారులు నగరానికి వచ్చారు. ఈ క్రమంలో వీరి ఆటను నేరుగా చూసి ఆస్వాదించాలనుకున్న అభిమానుల ఆశలు అడియాసలయ్యాయి. ఏకంగా 3 వేల ఉచిత పాసులను ఓ అధికారి తన కింది స్థాయి ఉద్యోగులకు పంచిపెట్టారు. అయితే, వారెవరూ ఇక్కడికి రాకపోగా.. స్టేడియం ఖాళీగా కనిపిస్తూ పరువు పోవడంతో పాటు టికెట్లు దక్కక సాధారణ క్రికెట్ అభిమానులకు నిరాశ మిగిలింది. తమ నగరానికే వచ్చిన అభిమాన క్రికెటర్ల ఆటను చూసి మురిసే భాగ్యం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ), జిల్లా క్రికెట్ అసోసియేషన్ (డీసీఏ) సమన్వయ లోపంతోనే ఈ దుస్థితి తలెత్తిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తీసికట్టుగా వసతులు..

దులీప్ ట్రోఫీ నిర్వహణకు రూ.4.5 కోట్లను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జిల్లా అసోసియేషన్‌కు పంపింది. ఇంత పెద్ద మొత్తంలో నిధులు అందినప్పటికీ కనీస వసతుల కల్పనలో నిర్వాహకులు విఫలమయ్యారు. విధుల్లో ఉన్న పోలీసులు, స్థానిక మీడియా ప్రతినిధులకు పాలిథిన్ కవర్లలో ఆహారం అందించారు. ఒక్కో భోజనానికి రూ.30 కూడా ఖర్చు చేయని పరిస్థితి. నేషనల్ మీడియా ప్రతినిధులకు సకల సౌకర్యాలు కల్పించి స్థానిక మీడియాపై మాత్రం చులకన భావం ప్రదర్శించడం విమర్శలకు తావిచ్చింది. బయట విధులకు కేటాయిస్తే ఇంట్లో ఆహారమైనా తిని డ్యూటీకి వెళ్లేవారమని, ఇక్కడ విధులకు కేటాయించడంతో నాసిరకమైన భోజనాన్ని తినాల్సి వచ్చిందని పోలీసులు, మీడియా ప్రతినిధులు ఆవేదన చెందుతున్నారు. అయితే, వీటికి సంబంధించి బిల్లుల్లో అధికంగా చూపి జేబులు నింపుకోనున్నారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ఇండియా సీ, ఇండియా డీ మ్యాచ్ జరిగినన్ని రోజులూ తగినంత మంది ప్రేక్షకులు లేని ఆర్డీటీ స్టేడియం





మీడియా ప్రతినిధులు, పోలీసు సిబ్బందికి పాలిథిన్ కవర్లలో ఇచ్చిన నాసిరకం భోజనం

స్నాక్స్, వాటర్ మాటున దోపిడీ..

బీసీసీఐ, ఏసీఏ ఆధ్వర్యంలో జరిగే ఏ టోర్నీలో అయినా స్నాక్స్, కూల్‌డ్రింక్స్ అమ్మకపు కాంట్రాక్టు అధికారికంగా అప్పగించాల్సి ఉంటుంది. కానీ దులీప్ ట్రోఫీ జరిగే ఆర్డీటీ క్రీడా గ్రామంలో స్నాక్స్, కూల్‌డ్రింక్స్ అమ్మకాలు ఒకే వ్యక్తి ఆధ్వర్యంలో జరిగాయి. ప్రేక్షకులకు ఉచితంగా మంచినీరు అందించాలని బీసీసీఐ నిర్దేశించినా.. మినరల్ వాటర్ పేరుతో ఒక గ్లాసు ఏకంగా రూ.10కు అమ్మకాలు సాగించారు. చిన్న పాప్‌కార్న్ పాకెట్ రూ.50కి విక్రయించారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

మాజీ క్రికెటర్లకు గౌరవమేదీ..?

స్టేడియంలో వీఐపీలకు కేటాయించిన బ్లాక్–ఏ గ్యాలరీ టికెట్లు ఎవరి చేతిలోకి వెళ్లాయో అంతుపట్టని పరిస్థితి. పైగా ఈ గ్యాలరీలోకి మాజీ క్రికెటర్లను అనుమతించకపోవడం గమనార్హం. దీనిపై జిల్లా, రంజీ స్థాయి మాజీ క్రికెటర్ల బాధ వర్ణనాతీతంగా మారింది. ఆర్గనైజింగ్ కమిటీలో మాజీ క్రికెటర్లకు అవకాశం కల్పించినా సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిసింది.

అభిమానుల ఆవేదన..

ద్వితీయ శ్రేణి నగరాల్లో దేశవాళీ టోర్నీలు నిర్వహిస్తే అభిమానులు ఆనందిస్తారు. తమ అభిమాన క్రికెటర్ల ఆట తీరును చూసేందుకు స్టేడియాలకు పోటెత్తుతారు. కానీ, అనంతలో మాత్రం ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ నవ్వులపాలు చేస్తుండడంపై అభిమానులు ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 12 నుంచి జరిగే మ్యాచుల నుంచైనా లోటుపాట్లు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

సిబ్బంది.. ఇబ్బంది

దులీప్ ట్రోఫీ మ్యాచులకు బందోబస్తు నిమిత్తం ఏకంగా 420 మంది పోలీసులను కేటాయించారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. ఈ నేపథ్యంలో గొడవలు జరిగే ఆస్కారముంటుంది. తగినంత మంది పోలీసు సిబ్బంది ఉంటే అలాంటి వాటిని కట్టడి చేసే అవకాశముంటుంది. కానీ, అవేవీ పట్టకుండా పెద్ద సంఖ్యలో పోలీసులను ఆర్డీటీ క్రీడాగ్రామం వద్ద మోహరించడంపై ఆ శాఖ సిబ్బంది నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ఇంత మంది పోలీసులను బందోబస్తుకు కేటాయించినా ఒక అభిమాని గ్రౌండ్‌లోకి దూసుకెళ్లడం గమనార్హం. ఇక.. పర్యవేక్షణ పేరిట తమనూ ఇక్కట్లకు గురిచేస్తున్నారంటూ రెవెన్యూ సిబ్బంది వాపోతున్నారు. దులీప్ ట్రోఫీ నిర్వహణలో కలెక్టర్, ఎస్పీ మితిమీరిన జోక్యం చేసుకుంటూ తమను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆయా శాఖల వర్గాలు వాపోతున్నాయి.



స్టేడియంలో అనధికారికంగా విక్రయిస్తున్న తినుబండారాల ధరల వివరాలు

నిరక్షరాస్యతను రూపుమాపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం: సమాజంలో అక్షరాస్యతను పెంపొందించి నిరక్షరాస్యతను రూపు మాపేందుకు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఆర్డీటీ పాఠశాలలో జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు. విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కుటుంబంలో ప్రతి మహిళ చదువుకోవడంతో పాటు తన పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. పిల్లలకు చిన్న వయసులో పెళ్లి చేయరాదన్నారు. నిరక్షరాస్యులకు ఐసీడీఎస్, పొదుపు సంఘాల ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, ఎంపీపీ సునీత, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, వయోజన విద్యా శాఖ డీడీ ఆంజినేయులు, ఎంఈఓ లింగానాయక్, ఎంపీడీఓ తేజోత్స్న, సర్పంచ్ వసంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు అనంత కుర్రాడు



వినయ్‌కుమార్



ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం: కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 27వ తేదీ వరకూ బెంగళూరు వేదికగా జరిగే టోర్నీలో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రా జట్టులో అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన ఎ.వినయ్‌కుమార్‌కు చోటు దక్కింది. అలాగే అసిస్టెంట్ కోచ్‌గా ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి ఎంపికయ్యారు. కాగా, వినయ్‌కుమార్ గత రెండేళ్లుగా ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటున్నాడు. 2023–24లో విజయ్ హజారే ట్రోఫీలో ఆడిన అనుభవం ఉంది. మంచి ఆల్‌రౌండర్‌గా ఆయనకు గుర్తింపు ఉంది. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం ముత్యాలచెరువుకు చెందిన ఎల్ఎన్ ప్రసాదరెడ్డి మాజీ రంజీ క్రీడాకారుడు. 53 ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీలు ఆడిన అనుభవం ఉంది. గత రెండేళ్లుగా ఆయన కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

జీతాలకు ఎదురుచూపులు

- పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్లు, ఆయాలకు 4 నెలలుగా అందని వేతనాలు
- రాజకీయ కక్షతో ఇప్పటికే చాలా చోట్ల తొలగింపులు

జిల్లాలో ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు పనిచేసే పాఠశాలలు	1,692
విధులు నిర్వహిస్తున్నవారు	1,855
ప్రతి నెలా వేతనం	రూ.6 వేలు
జమ కావాల్సిన మొత్తం	రూ.44.52 కోట్లు

రాయదుర్గం: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, గురుకులాలు, జూనియర్ కళాశాలల్లో పనిచేసే ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'అమ్మఒడి' పథకం ద్వారా రూ.15 వేలు తల్లులకు అందించేవారు. అందులో రూ.2 వేలు స్కూల్ మేనేజ్‌మెంట్ ఫండ్‌కు జమచేస్తూ వచ్చారు. ఆ డబ్బును క్రమం తప్పకుండా ఆయాలు, నైట్‌వాచ్ మెన్ల ఖాతాల్లో జమ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరిట కాలక్షేపం చేస్తుండడంతో కష్టాలు మొదలయ్యాయి.

ద్రావణాలకూ కొరతే..

వేతనాల మాట అటుంచితే కనీసం మరుగుదొడ్ల శుభ్రతకు వినియోగించే ద్రావణాలు, గ్లౌజులు, ఫినాయిల్ తదితరాలు అందించడంలోనూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో ఇబ్బందులు పడుతూనే ఆయాలు వాటిని శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయాలు, వాచ్‌మెన్లకు వేతనాలతో పాటు మరుగుదొడ్ల శుభ్రతకు అవసరమయ్యే వస్తువులను అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలను శుభ్రం చేస్తున్న ఆయా

కక్షకట్టి తొలగింపులు..

కూటమి ప్రభుత్వం వచ్చాక కక్ష కట్టి మరీ టీడీపీ నాయకులు చాలా చోట్ల ఆయాలను తొలగించారు. ఉద్యోగం పోతే తమకు దిక్కులేదంటూ బాధితులు వేడుకున్నా కనికరించలేదు. రాయదుర్గం పట్టణంలోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఆయాలను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారు. దిక్కుతోచని స్థితిలో పడిన వారు ఇటీవల స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్దకు పురుగు మందు డబ్బా తీసుకెళ్లి ఆందోళన చేశారు. పురుగు మందు తాగేందుకు యత్నిస్తే ఎంఈఓ–2 వెంకటరమేష్ అడ్డుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని మళ్లీ వారిని విధుల్లోకి పంపారు. ఇలాగే, గుమ్మఘట్ట మండలం కలుగోడు పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న షబానాబేగంను తొలగించగా, విధిలేని పరిస్థితుల్లో ఆమె యాచన చేస్తూ పొట్ట నింపుకుంటున్నారు. ఆమె భర్త మృతి చెందారు. ఉండేందుకు ఇల్లు కూడా లేదు. అలాంటి మహిళపై కనీసం దయ చూపకుండా స్థానికులు టీడీపీ నాయకులు తొలగించారు.

నిధులు విడుదల కావాలి



పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు రావాల్సిన వేతన బకాయిలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదల కావాల్సి ఉంది. రాగానే నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తాం. ఆయాల్లో అనాథలు ఎవరైనా ఉంటే తప్పక కొనసాగిస్తాం. ఎక్కడా బలవంతంగా తొలగించిన విషయం మా దృష్టికి రాలేదు.

– బి.వరలక్ష్మి, డీఈఓ, అనంతపురం

క్లుప్తంగా

ముగిసిన అండర్-9 చెస్ చాంపియన్ షిప్ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

అనంతపురం: ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం వేదికగా జరిగిన అండర్-9, ఓపెన్ బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. అండర్-9 ఓపెన్ విభాగం చాంపియన్‌గా సాకేత్, రన్నర్‌గా ఆర్.హేమచరణ్‌రెడ్డి, మూడో స్థానంలో సంజయ్ సాహల్, నిలిచారు. బాలికల విభాగంలో చాంపియన్‌గా షారోస్ బ్లెస్సీ నిలిచింది. ద్వితీయ స్థానంలో పల్లినేని హారిక చౌదరి, మూడో స్థానంలో యర్రం దివ్య నిలిచారు. విజేతలను ఇంటర్నేషనల్ ఆర్బిటర్ ఉదయ్‌కుమార్ నాయుడు, టోర్నమెంట్ డైరెక్టర్ కిశోర్ కుమార్, నేషనల్ ఆర్బిటర్ కమల్ అభినందిస్తూ బహుమతులను ప్రదానం చేశారు.

8 మందిపై కేసు నమోదు



నరికి వేసిన తోటను పరిశీలిస్తున్న పోలీసులు

యాడికి: మండలంలోని రాయలచెరువులో మహిళా రైతు పద్మజకు చెందిన తోటలో 150 నేరేడు, 100 టెంకాయ, 100 నిమ్మ చెట్లను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. విషయం తెలుసుకున్న సీఐ వీరన్న... అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు రాయలచెరువుకు చెందిన మాజీ ఎంపీపీ రంగయ్య, చరణ్, ఎం.శివ, నెట్టికంటయ్యతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'అనంత'లో చేతన్‌శర్మ పర్యటన



బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేతన్‌శర్మ, అజయ్‌మెహ్రా, అమిత్ సిద్ధేశ్వర్

అనంతపురం: భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ కామెంటరేటర్ చేతన్ శర్మతో పాటు ఫస్ట్‌క్లాస్ క్రికెటర్, కామెంటరేటర్ అజయ్ మెహ్రా, బీసీసీఐ క్రికెట్ ఆపరేషన్స్ మేనేజర్ అమిత్ సిద్ధేశ్వర్ ఆదివారం అనంతపురానికి చేరుకున్నారు. అనంత క్రీడా గ్రామంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో వారి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ క్రమంలో ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం బత్తలపల్లిలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ సమాధిని, పుట్టపర్తిలో సత్యసాయి మహాసమాధిని సందర్శించారు.

ఇండియా 'సీ' శుభారంభం

- సమష్టిగా రాణించి విజయం కైవసం
- ఆల్‌రౌండర్‌గా మెరిసిన మనవ్ సుతార్
- ముచ్చటగా మూడో రోజే ముగిసిన మ్యాచ్



మనవ్ సుతార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న మాంచూఫెర్రర్

అనంతపురం: అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియంలో జరిగిన దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా-సీ జట్టు శుభారంభం చేసింది. ఇండియా-డీపై నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నాలుగు రోజుల మ్యాచ్ కాస్తా మూడో రోజు శనివారమే ముగిసిపోయింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' మనవ్ సుతార్ అటు బాల్, ఇటు బ్యాట్‌తో రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. 8 వికెట్ల నష్టానికి 206 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో శనివారం మూడోరోజు ఆట కొనసాగించిన ఇండియా-డీ జట్టు మరో 30 పరుగులు జోడించి మిగిలిన రెండు వికెట్లూ కోల్పోయి 236 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇండియా-సీ బౌలర్ మనవ్ సుతార్ ఏడు వికెట్లతో ఇండియా-డీ పతనాన్ని శాసించాడు. అలాగే విజయకుమార్ వైశాఖ్ 2, అన్షుల్ కాంబోజ్ ఒక వికెట్ తీశారు.

ఆడుతూ..పాడుతూ

నాలుగు పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత పోను 233 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా-సీ జట్టు ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్లు రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రుతురాజ్ 48 బంతుల్లో 8 ఫోర్లతో 46 పరుగులు చేశాడు. సాయి సుదర్శన్ 22, ఆర్యన్ జుయల్ మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 47, రజత్ పటిదార్ ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించారు. బాబా ఇంద్రజిత్ (7 పరుగులు), హృతిక్ షోకీన్(0) తక్కువ స్కోరుకే ఔట్ అయినప్పటికీ వికెట్ కీపర్ అభిషేక్ పోరెల్ 35 పరుగులు (నాటౌట్), మనవ్ సుతార్ 19 పరుగులు (నాటౌట్) చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. ఇండియా-డీ బౌలర్లలో సరాన్ష్ జైన్ 4, అర్ష్‌దీప్‌సింగ్, అక్షర్ పటేల్ చెరో వికెట్ తీశారు.



షార్ట్ లెగ్ దిశగా బంతిని కొడుతున్న బ్యాటర్

ఇండియా-సీ (రెండో ఇన్నింగ్స్)-233/6			
రుతురాజ్ గైక్వాడ్	46	(సి) శ్రేయస్ అయ్యర్	(బి)సరాన్ష్ జైన్
బి.సాయిసుదర్శన్	22	(సి)రికీభుయి	(బి)సరాన్ష్ జైన్
ఆర్యన్ జుయల్	47	(సి)హర్షిత్ రాణా	(బి) అర్షదీప్ సింగ్
రజత్ పటిదార్	44	(స్టంప్) కేఎస్ భరత్	(బి) సరాన్ష్ జైన్
బి.ఇంద్రజిత్	7	(సి)అథర్వ టైడ్	(బి) సరాన్ష్ జైన్
అభిషేక్ పోరెల్	35	నాటౌట్	
హృతిక్ షోకీన్	0	(సి)రికీ భుయి	(బి) అక్షర్ పటేల్
ఎంజే సుతార్	19	నాటౌట్	
ఎక్స్‌ట్రాలు	13		
ఓవర్లు	61		
స్కోర్	233/6		

బౌలింగ్	ఓవర్లు	మేడిన్	పరుగులు	వికెట్లు
హర్షిత్ రాణా	6	0	39	0
అర్షదీప్ సింగ్	9	1	37	1
సరాన్ష్ జైన్	22	2	92	4
అక్షర్‌పటేల్	22	6	54	1
ఏఎస్ థాక్రే	2	0	6	0



రజత్ పటిదార్‌ను స్టంప్ అవుట్ చేస్తున్న వికెట్ కీపర్ కేఎస్ భరత్

నేడు అనంతకు ఇండియా ఏ, బీ జట్ల రాక

దులీప్ ట్రోఫీలో భాగంగా తొలి రౌండ్‌లో ఒక మ్యాచ్ అనంత క్రీడా గ్రామంలో, మరో మ్యాచ్ బెంగళూరులో జరిగింది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లూ ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు అనంత క్రీడాగ్రామంలోనే నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం బెంగళూరు నుంచి ఇండియా ఏ, బీ జట్ల క్రీడాకారులు రానున్నారు. ఇండియా-ఏకు శుభమన్‌గిల్, బీ జట్టుకు అభిమన్యు ఈశ్వరన్ కెప్టెన్‌లుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. కాగా, 12 నుంచి 15వ తేదీ వరకూ టీమ్-ఏ, టీమ్-డీ మ్యాచ్ అనంతపురం ఆర్డీటీ స్టేడియం-ఏలో, టీమ్-బీ, టీమ్-సీ మధ్య మ్యాచ్ ఏసీఏ మైదానంలో జరుగుతాయి. 19 నుంచి 22వ తేదీ వరకు టీమ్-బీ, టీమ్-డీ మ్యాచ్ స్టేడియం-ఏలో, టీమ్-ఏ, టీమ్-సీ మధ్య మ్యాచ్ ఏసీఏ మైదానంలో ఉంటాయి.

మేయర్‌కు రష్యా ఆహ్వానం



అనంతపురం కార్పొరేషన్: నగరాల డిజిటలీకరణ అంశంపై రష్యాలో జరిగే సదస్సుకు వర్చువల్ విధానంలో హాజరు కావాలని అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీంకు ఆ దేశ ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ రష్యాలోని ఖజాన్‌లో 5వ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. మొత్తం 48 దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. ప్రధానంగా రవాణా వ్యవస్థలు, సైబర్ భద్రత, విద్య, సంస్కృతి, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం తదితర అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ఈ నెల 9న డిజిటలీకరణకు సంబంధించిన అంశంపై వర్చువల్ విధానంలో మాట్లాడేందుకు మేయర్ వసీంకు అవకాశం ఇచ్చారు. దీనిపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది అనంతపురం వాసులకు దక్కిన అరుదైన అవకాశంగా భావిస్తున్నానన్నారు.

వివాహిత బలవన్మరణం



మృతురాలు హారిక

కంబదూరు: మండలంలోని నూతిమడుగు గ్రామానికి చెందిన వివాహిత హారిక(23) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... మూడేళ్ల క్రితం నూతిమడుగు గ్రామానికి చెందిన మహేష్‌తో హారికకు పెళ్లైంది. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కడుపు నొప్పి తీవ్రతను తాళలేని ఆమె జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

అనంతపురం సిటీ: రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురానికి చెందిన ఆటో డ్రైవర్ సి.మంజునాథ(55) బెంగళూరుకు వెళ్లొస్తానని చెప్పి శనివారం అర్ధరాత్రి ఇంటి నుంచి బయలుదేరాడు. టవర్ క్లాక్ సమీపంలో పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొంది. దీంతో మంజునాథ ఎగిరి పట్టాల పక్కన ఉన్న నిర్జన ప్రదేశంలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కంటి చూపు సరిగా లేకపోవడంతో రైలు వస్తున్న విషయం గమనించక.. ప్రాణాల మీదికి తెచ్చుకున్నట్లుగా మృతుడి కుటుంబసభ్యులు వాపోయారు. ఆయనకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు!



హతురాలు కళావతి

బుక్కరాయసముద్రం: కలకాలం తోడుంటానని అగ్ని సాక్షిగా ప్రమాణం చేసిన భర్తే కాలయముడయ్యాడు. నిద్రలో ఉన్న భార్యను దారుణంగా హతమార్చి ఉడాయించాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం బాట్లో కొత్తపల్లికి చెందిన గంగాధర్ అలియాస్ బాలు, కళావతి (30) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన గంగాధర్ రోజూ తప్పతాగి ఇంటికి చేరుకుని భార్యతో గొడవపడే వాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న అతను అకారణంగా భార్యతో గొడవ పడ్డాడు. చుట్టుపక్కల వారు కల్పించుకుని సర్ది చెప్పడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. అర్ధరాత్రి దాటిన తర్వాత నిద్రిస్తున్న కళావతి తలపై గంగాధర్ బ్యాట్‌తో మోది హతమార్చి అక్కడి నుంచి ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి మృతి



మృతుడు చంద్ర

విడపనకల్లు: మండలంలోని 42వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ఉరవకొండ మండలం రాకెట్లకు చెందిన చంద్ర(37)కు భార్య, పిల్లలు ఉన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదివారం విడపనకల్లులో ఎలక్ట్రికల్ పని ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో పెద్దకొట్టాలపల్లి వద్దకు చేరుకోగానే అప్పటికే టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కనే ఆపి ఉన్న లారీని చీకట్లో గుర్తించక వెనుక నుంచి ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రాచీన ఆలయాలను సందర్శించిన కలెక్టర్



పూర్ణకుంభంతో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న భోగేశ్వరాలయ అర్చకులు

పామిడి: స్థానిక ప్రాచీన భోగేశ్వర, అనంత గజగరుడ లక్ష్మీనారాయణ (తగ్గ దేవాలయం) ఆలయాలను ఆదివారం ఉదయం కలెక్టర్ వినోద్‌కుమార్ సందర్శించారు. భోగేశ్వరాలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సోమశంకర్‌శర్మ, రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేసి, వేద ఆశీర్వాదంతో సత్కరించారు. అనంతరం ఆలయ విశేషాలను వివరించారు. తగ్గ దేయాలయంలోనూ విశేష పూజల అనంతరం తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ డి.ప్రభాకర్‌నాయక్, ఆలయాల ధర్మకర్తలు ఎన్ మురళీధర్‌గుప్తా, సాయిప్రకాష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.నారాయణమూర్తి, సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఉపేంద్ర, నల్లయ్య, బీవీ రత్నమయ్య, డబ్బీదార్ జవళకర్ శ్రీనివాసరావు, అడ్వకేట్ దత్తు తదితరులు ఉన్నారు.

వైభవంగా బోడమల్లయ్య స్వామి ఉత్సవం





కొలువుదీరిన బోడమల్లయ్యస్వామి, ఉత్సవానికి హాజరైన భక్తులు

రాప్తాడు: వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ రాప్తాడు మండలం హంపాపురం, గొల్లపల్లి గ్రామాల మధ్య పొలాల్లో వెలసిన బోడమల్లయ్య స్వామికి బాలగొండకాపులు (కురుబలు) భక్తి శ్రద్ధలతో ఉత్సవం నిర్వహించారు. ఏటా భాద్రపద శుద్ధ పంచమి నాడు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉపవాస దీక్ష బూని ఆదివారం తెల్లవారుజామున బోడమల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగులు, గొరవయ్యలకు పాలు పోసి ఉపవాస దీక్షను విరమించారు. వందలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కాగా, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత... స్థానిక నాయకులతో కలసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... బోడమల్లయ్యస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఇప్పటికే 44వ జాతీయ రహదారి నుంచి ఆలయం వరకూ మట్టి రోడ్డు ఏర్పాటు చేసినట్లుగా గుర్తు చేశారు.

ఎస్ఎస్ ట్యాంక్ నుంచి మట్టి అక్రమ తరలింపు



మట్టిని తరలిస్తున్న దృశ్యం

కణేకల్లు: రాయదుర్గం వాసుల దాహార్తి తీర్చేందుకు కణేకల్లు శివారులో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం తెలిసినా తమకేమీ పట్టనట్లు రాయదుర్గం మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తుండడం గమనార్హం. గతంలో మున్సిపల్ అధికారులు ఓ ఉద్యోగిని ఇక్కడ ఏర్పాటు చేసి, మట్టి తరలిపోకుండా కాపాడారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ మట్టిని టీడీపీకి చెందిన ఓ నేత పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలించినా అడ్డుకునేవారు లేరు. ఈ విషయం మున్సిపల్ అధికారులకు కొందరు చేరవేసినా తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోయారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

బుక్కరాయసముద్రం: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కుళ్లాయమ్మ (60) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. చిన్న కుమారుడు లక్ష్మీనారాయణ వద్ద ఉంటున్న ఆమె ఆదివారం ఉదయం స్నానానికి నీళ్ల వేడి చేసేందుకు బాత్‌రూంలో హీటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, దర్యాప్తు చేపట్టారు.

తవ్వకాల్లో విగ్రహం దొరికిందంటూ ప్రచారం



అయ్యప్ప స్వామి విగ్రహం

బొమ్మనహళ్ (బెళుగుప్ప): మండలంలోని దుద్దేకుంటలో శనివారం క్రాంతితో పాటు మరికొందరు యువకులు చేపట్టిన తవ్వకాల్లో అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహం బయటపడిందంటూ ప్రచారం సాగింది. క్రాంతి మాట్లాడుతూ.. తనకు కలలో అయ్యప్పస్వామి కనిపించి చెప్పడంతో తవ్వకాలు చేపట్టినట్లు తెలిపాడు. విషయం కాస్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని విగ్రహాన్ని ఆసక్తిగా గమనించారు. అయితే నల్లరేగడి భూముల్లో అయ్యప్పస్వామి విగ్రహం బయటపడడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించి విభేదాలు ఉన్న నేపథ్యంలో ఇందులోని వాస్తవాలు నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

11న పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈ నెల 11న 'పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా' నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ రామమూర్తి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో పాసైన విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణత, ఐటీఐ మార్కుల జాబిత, ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం... మొత్తం మూడు సెట్ల నకళ్లను వెంట తీసుకెళ్లాలి.

రేపు జాబ్‌మేళా

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 9 గంటలకు అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్ .ఆనంద్‌రాజ్ కుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 10 కంపెనీల ప్రతినిధులు హాజరై... ఆయా కంపెనీల్లో ఖాళీగా ఉన్న 900కి పైగా పోస్టులను భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు. పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావచ్చు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసుండాలి. విద్యార్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ -99888 53335 లేదా, కరీముల్లా (08554-245547)ను సంప్రదించవచ్చు.

కొనసాగుతున్న తాగునీటి పథకం కార్మికుల నిరసనలు



కూడేరులో నిరసన తెలుపుతున్న కార్మికులు



వజ్రకరూరులో ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

కూడేరు/కళ్యాణదుర్గం రూరల్/వజ్రకరూరు: శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టుల్లో పని చేస్తున్న కార్మికుల నిరసన కార్మికులు కొనసాగుతూ ఉన్నాయి. శనివారం కూడేరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి పచ్చి గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఆదివారం ఉదయం కూడేరు బస్టాండ్‌లో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ నాగరాజు, వ్యకాసం జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమూర్తి, సీపీఎం మండల నేతలు, ఆయా ప్రాజెక్టుల కార్మికులు శ్రీనివాసులు, ఎర్రిస్వామి, గోవింద్, రామకృష్ణ, నాగరాజు, శీన, లక్ష్మీనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదివారం ఉదయం కళ్యాణదుర్గంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా కార్మికులు నిరసన తెలిపారు. సమ్మె శిబిరంలోనే వినాయక ప్రతిమ ఏర్పాటు చేసి 8 నెలలుగా జీతాలు అందక తాము పడుతున్న బాధలు ఆలకించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాల కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ధర్నా..

సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో వజ్రకరూరు మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ క్రమంలో నీటి సరఫరాను పునరుద్ధరించాలంటూ వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు వాహన రాకపోకలు స్తంభించాయి. తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఫలితంగా తాగునీరు అందక తామంతా ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని సర్దిచెప్పడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు.

క్లుప్తంగా

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ


వరద బాధితుల సహాయార్థం బియ్యం సేకరిస్తున్న యువకులు

చెన్నేకొత్తపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలు విజయవాడను అతలాకుతలం చేశాయి. వరద పోటెత్తడంతో అక్కడి ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. అక్కడి ప్రజలు తినడానికి తిండి లేక తాగడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ ప్రజలకు తోచిన సహాయం అందిచాలని భావించిన మండల పరిధిలోని చందమూరు గ్రామానికి చెందిన యువకులు ఆదివారం ఇంటింటా తిరుగుతూ బియ్యం సేకరించారు. ఇప్పటి వరకు 11 ప్యాకెట్ల బియ్యం సేకరించినట్లు వెల్లడించారు. ఇంకా చుట్టు పక్కల గ్రామాల్లో బియ్యం సేకరించి వరద బాధితులకు అందిస్తామని తెలిపారు. యువకులు చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు అభినందించారు.

ధ్వజ స్తంభంపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం

రాప్తాడు: మండలంలోని హంపాపురం, గొల్లపల్లి గ్రామాల మధ్య పొలాల్లో వెలసిన బోడ మల్లయ్య స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభంపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలగొండ ధనుంజయ రాప్తాడుకు చెందిన పామాల్ల కోటేశ్వర, ముత్యాలమ్మల చిన్న కుతూరు పామాల రేణుకను వివాహం చేసుకున్నాడు. రాప్తాడులోనే ఉంటూ స్కూల్ పిల్లలకు ట్యూషన్ చెప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఆలయం వద్ద బోడ మల్లయ్య స్వామి ఉత్సవం (పరుష) ఉండటంతో ఆలయం వద్ద ధ్వజ స్తంభంపై స్వామి జెండాను కట్టేందుకు ఎక్కాడు. అక్కడ కళ్లు తిరగడంతో పై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆలయ కమిటీ సభ్యులు క్షతగాత్రుడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ధనుంజయ పరిస్థితి బాగానే ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన


వివాహ పరిచయ వేదికకు హాజరైన వధూవరుల తల్లిదండ్రులు

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'రెడ్డి వివాహ పరిచయ వేదిక'కు మంచి స్పందన లభించింది. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని రెడ్డి జన సంఘం కార్యాలయంలో ఈ వేదిక ఏర్పాటు చేశారు. వధూవరుల తల్లిదండ్రులు హాజరై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మరామిరెడ్డి, సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, అధ్యక్షుడు రొద్దం సురేష్ రెడ్డి, సెక్రటరీ కిషోర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామికి ఆకుపూజతో పాటు విశేష పూజలు చేపట్టారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.

జయములివ్వు.. బొజ్జ గణేశా


వినాయకుడికి పూజలు చేస్తున్న మేయర్ వసీం, కార్పొరేటర్లు


ఆత్మకూరులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సాయినగర్ 3వ క్రాస్‌లో..


రాప్తాడు కురుబ వీధిలో..


రాప్తాడు బోయ వీధిలో పూజలు చేస్తున్న భక్తులు


ఉమానగర్‌లో భక్తుల పూజలు..


బోయ వీధిలో ఆకట్టుకున్న వేంకటేశ్వరుడి అలంకారం..


కోవూరు నగర్‌లో పూజలందుకున్న లంబోధరుడు


ఖాజానగర్‌లో అశ్వత్థామ వినాయకుడు

అనంతపురం అర్బన్: సకల గణాలకు అధిపతి అయిన ఆ గణాధీషుని కరుణ కటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అకాంక్షించారు. రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం స్థానిక కృష్ణకళా మందిర్‌లోని రెవెన్యూ హోమ్‌లో వినాయక చవితి వేడుకలు జరిగాయి. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విఘ్నేశ్వరుడికి తొలి పూజ చేశారు. అనంతరం హోం ఆవరణలో మొక్కలు నాటారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి దివాకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి మారుతి, సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, తహసీల్దార్లు బ్రహ్మయ్య, రజాక్‌వలి, మోహన్, డీఐపీఆర్‌ఓ గురుస్వామి శెట్టి, రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది, నారాయణ స్వామి, మారుతీప్రసాద్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, మంజునాథ్, వరకుమార్, భరత్, శీనా, తదితరులు పాల్గొన్నారు.

విభిన్నరూపాలలో గణపయ్య..

అనంతపురం కల్చరల్: 'వక్రతుండ మహాకాయ.. కోటి సూర్య సమప్రభ' అంటూ విఘ్నాలను తొలగించే వినాయకుడి స్తుతితో నగరం మార్మోగింది. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, అలంకారాల్లో గణపతిని భక్తిశ్రద్ధలతో ఆరాధించుకున్నారు. ఐదు రోజుల పాటూ సాగే సప్తగిరి సర్కిల్ వద్ద సాగే ఉత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. మేయర్ వసీం, పలువురు కార్పొరేటర్లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎటువంటి ప్రతిబంధకాలు లేకుండా వినాయక ఉత్సవాలు సాగాలని, నిమజ్జనం ప్రశాంతంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. జిల్లాలోనే అత్యంతం వైభవంగా సాగే సప్తగిరి సర్కిల్ వినాయక చౌక్‌లో ఏర్పాటైన ఉజ్జయినీ కాళేశ్వరుడి వృత్తాంతంతో కదలికల వినాయకున్ని చూసి తరించడానికి భక్తులు బారులుదీరారు. బళ్లారి రోడ్డు సత్యదేవనగర్‌లో అమ్మవారి రూపంలో వినాయకుడు, ఎన్‌టీఎస్ కాలనీ, అరవిందనగర్‌లో నిలువెత్తు పసుపుగొమ్మల వినాయకుడు, హౌసింగ్ బోర్డులో వేపచెక్కల వినాయకుడు, మొదటి రోడ్డులో చాక్లెట్ అలంకారంలో వినాయకుడు దర్శనమిచ్చారు. ఆదర్శ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు వినాయక చిత్రాలతో అలరించారు. అలాగే కమలానగర్‌లో కాలుష్యరహిత వినాయకుడు నగరవాసులను అమితంగా ఆకట్టుకున్నాడు.

ఆత్మకూరు/రాప్తాడురూరల్/రాప్తాడు: అనంతపురం రూరల్ మండలం పాపంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో 'తేలు' వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. '8వ వండర్ బ్యాచ్' ఆధ్వర్యంలో ఈ వినాయకుడిని ఏర్పాటు చేశారు. సిండికేట్‌నగర్ సమీపంలో విగ్రహ తయారీదారులతో ప్రత్యేకంగా మాట్లాడి మట్టితో ఈ వినాయకుడిని తయారు చేయించారు. ఆత్మకూరులో వినాయకుడి విగ్రహాల వద్ద నిర్వహకులు ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. తాడు లాగుడు పోటీలు, ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. రాప్తాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ప్రజలు వాడవాడలా వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్మయనగర్‌లో వెలసిన చిన్మయానంద ఉత్సవ సమితి నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్షీర సముద్రం చిలికిన దృశ్యాలను తలపిస్తూ కళ్లు తెరుస్తూ, మూస్తూ వినాయకున్ని ఏర్పాటు చేశారు. రాప్తాడులో ప్రాథమిక పాఠశాల ముందు వెలసిన వినాయకుడి దగ్గర ఏర్పాటు చేసిన చెక్క భజన అందరినీ అలరించింది. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ టీ.వి.హర్ష మండల ప్రజలకు సూచించారు. మండలా వ్యాప్తంగా దాదాపుగా 100కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు.


అనంతపురం మొదటి రోడ్డులో పూజలందుకున్న గణపయ్య


ఎన్‌టీఎస్ కాలనీలో కొలువైన సిద్ధి వినాయకుడు


కమలానగర్‌లో కొలువుదీరిన పార్వతీ తనయుడు


శ్రీరాముడు, వినాయక రూపంలో వినాయకుడు


జీసస్ నగర్‌లో కొలువుదీరిన వినాయకుడు


రెడ్డివారి వీధిలో సప్తస్వరాల వినాయకుడు


రాప్తాడులో ప్రాథమిక పాఠశాల ముందు చెక్క భజన చేస్తున్న దృశ్యం


పాతూరు బంగారు గేరులో..


కమలానగర్‌లో కాలుష్య రహిత వినాయకుడు


రామచంద్ర నగర్‌లో పాండురంగ వినాయకుడు


మొదటి రోడ్డులో చాక్లెట్ అలంకరణలో వినాయకుడు

సిద్ధేశ్వరంతోనే సీమకు సాగునీరు


సిద్ధేశ్వరం పాటను ఆవిష్కరిస్తున్న అతిథులు

అనంతపురం సిటీ: సిద్ధేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు లభిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జలసాధన సమితి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు డాక్టర్ సిగిలిరేవు రామాంజనేయులు రచించి గానం చేసిన సిద్ధేశ్వరం పాటను ఆదివారం ఆవిష్కరించారు. ఫోర్స్ అధ్యక్షుడు, సీమ ఉద్యమకారుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలవనరుల శాఖ విశ్రాంత ఇంజినీర్ పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి హాజరై పాటను ఆవిష్కరించారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. సీమ ప్రజలకు సాగు, తాగునీటి అవసరాలు, ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించేందుకే ఇలాంటి సదస్సులు మరెన్నో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సీమ ప్రాంత ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి సిద్ధేశ్వరం ప్రాజెక్టు నిర్మించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. రాయలసీమ ప్రాంతానికి అన్ని రాజకీయ పార్టీలు, పాలకులు ద్రోహం చేశారని సభాధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి నిప్పులు చెరిగారు. సిద్ధేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని స్పష్టం చేశారు. సిద్ధేశ్వరం ప్రాజెక్టు అవసరాన్ని తెలియజేస్తూ.. ఎంతో శ్రమకోర్చి ఈ పాటను రాయలసీమ ప్రాంత ప్రజకు కానుకగా ఇస్తున్నామని ప్రకటించారు. అనంతరం పాటను అద్భుతంగా రాసి, గానం చేసిన రామాంజనేయులును అభినందించారు. కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకుడు ఇండ్ల ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ జెన్నె ఆనంద్, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ ద్వారా నగర ప్రజలకు సరఫరా చేసే పీఏబీఆర్ డ్యాం తాగునీరు సరఫరా చేసే పైపులైను మరమ్మతుల కారణంగా సోమవారం సాయంత్రం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు గమనించి తాగునీరు పొదుపుగా వాడుకుని సహకరించాలని కోరారు.

ఆర్డినెన్స్ జారీ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పసలూరి ఓబిలేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో తొలితరం నేత విరూపాక్షమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పసలూరి ఓబిలేసు మాట్లాడుతూ.. మాదిగల ఉద్యమం మహోన్నతమైన శక్తిగా మారిందన్నారు. మాదిగలు ఐక్యతగా పని చేయాలని పిలుపునిచారు. విరూపాక్షమ్మ జాతికోసం నిస్వార్థంగా పని చేసిందని కొనియాడారు. కార్యక్రమంలో ఓగులప్ప, రామన్న, కుంటిమద్ది ఓబిలేసు, శివయ్య, సుంకన్న, బెంజిమెన్, జగదీష్, సాకే శంకర్, నిస్సార్, సువర్ణ రాజు, వసుందర, భువనేశ్వరి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ వేలంలో పాల్గొనండి

అనంతపురం కల్చరల్: నగరంలోని బళ్లారి రోడ్డు సత్యదేవనగర్‌లో వెలసిన గణనాథుడి వినాయక ఉత్సవాలు ఐదురోజుల పాటూ జరగనున్నాయ. చివరి రోజు లడ్డూ వేలం వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి రూపంలో విశేషంగా ఆకట్టుకునే రూపంలో ఏర్పాటు చేసిన ఉత్సవం వద్ద ఆదివారం ప్రత్యేక సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యదేవనగర్ వినాయక చవితి మిత్రబృందం మాట్లాడుతూ.. 42 ఏళ్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి తిరుమల శ్రీవారి లడ్డూను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదవ రోజు లడ్డూ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గోపీస్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు తీర్థప్రసాద వితరణ జరిగాయి.

కొనసాగుతున్న సమ్మె



ఆత్మకూరులో సమ్మె చేస్తున్న సత్యసాయి కార్మికులు

ఆత్మకూరు: పెండింగ్ జీతాలు చెల్లించి, తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు స్పష్టం చేశారు. ఆదివారం విధులు బహిష్కరించి సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో ఓబన్న, చిన్నా, శ్రీధర్, మల్లి, సాయిప్రసాద్ రెడ్డి, చెన్నకేశవులు, శ్రీరాములు హరి, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొట్టిన ఆటో


దెబ్బతిన్న రైల్వే గేట్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డులో రైల్వే గేట్‌ను ఆదివారం ఆటో ఢీకొన్న సంఘ టన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మర్తాడు వైపు నుంచి ఆటో గార్లదిన్నెలోకి వెళ్తుండగా రైల్వే అధికారులు గేట్ వేసేందుకు సైరన్ మొగించారు.ఆ సమయంలో ఆటో డ్రైవర్ వేగంగా ఆటో నడుపుకుంటూ రైల్వే గేట్ దాటే ప్రయత్నం చేశాడు. ఒక వైపు గేట్ దాటుకున్నా.. రెండో వైపు ఉన్న గేట్ కిందకు దింపడంతో ఆటో రైల్వే గేట్‌ను ఢీకొట్టింది.దీంతో రైల్వే గేట్ విరిగి పోయింది. వెంటనే రైల్వే గేట్ సిబ్బంది తాత్కాలిక గేట్ వేశారు.